



# నువ్వూ - నేనూ ఒకటే

రష్యన్ మూలం: చెహోవ్
తెలుగు గొంతు: కరుణారుణ

నవదంపతులం బయులుదేరుతుంటే,

"జాగ్రత్త నాయనా! జమిందారిణి ఇంటికి మాత్రం తప్పకుండా వెళ్లండోసారి. నేనంటే ఆమెకు చాలా అభిమానం. అలాగే, మేయరు గారి భార్యను కూడా వీలైనప్పుడు పలకరించండి. ఒకరింటికెళ్లి ఒకరింటి కెళ్లకపోతే ఏమైనా అనుకుంటారు మరి." అంటూ సాగనంపింది మమ్మల్ని మా అత్తగారు.

కొత్తగా పెళ్లైనవాళ్లూ అందరిళ్లకూ వెళ్లటం ఆచారం. మా ఆవిడ విరక్తిగా మొహం పెట్టుకుంది. నాకూ, మా ఆవిడకూ చాలా విషయాల్లో భేదం ఉంటే వుండొచ్చుగాని, మా బంధు మిత్రుల విషయంలో మాత్రం అస్సలు పొసగదు.

ఆవిడ వైపు వాళ్లంతా పెద్ద పెద్ద ఆఫీసర్లు, వున్నతోద్యోగులు, లక్షాధికార్లు.

నా వైపున్న పెద్ద వుద్యోగి ఓ గవర్నమెంటాఫీసులో సూపర్నెంటు, మరో గుమాస్తా, కోర్టులో పని చేసే మరొకరూ. పైగా అందరూ తాగుబోతులూ, పనికి రానివాళ్లూ, సిగ్గు సిగ్గు. మా ఆవిడ మనసు బాధ పెట్టకుండా ఉండాలంటే మేం నా బంధువుల ఇళ్లకు వెళ్లకపోవటమే మంచిది. కాని మర్యాద. వెళ్లకపోతే ఏమనుకుంటారు? కనీసం మా అంకుల్ ఇంటికన్నా వెళ్లాలి. పెళ్లికి ఆయన సాయం చేశాడు కూడాను.

అంకుల్ ఇల్లు చూసి షాక్ తినకుండా, ముందే మా ఆవిణ్ణి దువ్వటం

మొదలెట్టాను.

"పాపం, అంకుల్ పూర్వీకుల్ది కూడ గొప్ప వంశమే. ఆయన తాత ఓ రాజుగారి వద్ద దివానుగా వుండేవాడట. అయితే ఆస్తంతా హరించుకుపోయిందిలే. వాళ్లను చూసి నవ్వకు. బాధపడతారు..."

మా జట్కా ఓ పెంకుటింటి ముందాగింది. పెచ్చులూడి పోతున్న గోడలు. సగం విరిగిన తలుపు. లోపల కుక్క మొరుగుతున్నది.

చింపిరిజుత్తుతో మా అంకుల్ కూతురు వచ్చి తలుపుతీసింది. (ఆ పిల్ల నా బంధువని తెలిస్తే మా ఆవిడేమనుకుంటుందో). ఆ పిల్లను పక్కకు తోసి మేం సరాసరిగా మా అంకుల్ కూర్చున్న గదిలోకెళ్లాం. ఆయన అరిగిన చెప్పులు గదిముందర దర్శనమిచ్చాయి. (అతడింట్లో లేకుండా వుంటే ఎంత బావుండేది! మేం వెంటనే వెళ్లిపోయేవాళ్లం కదా!)

ఆరెంజ్ జూస్ బాటిల్‌లో తొక్కపడినట్టున్నట్టుంది. తియ్యటానికి ప్రయత్నిస్తున్నాడు. మా రాకకు దిగ్భ్రాంతి చెంది, 'ఒక్క నిమిషంలో వస్తాను. కూర్చోండి" అంటూ లోపలికి పారిపోయాడు'.

"చూశావా, మనమంటే ఎంత భయమో. ఛీ ఛీ. ఇల్లు సరిగ్గా పెట్టుకోవటం కూడా రాదు. గడియారం ఆగిపోయింది. టేబుల్ కాలు విరిగింది. వీళ్లు మనుషులో, జంతువులో..." అన్నాను మా ఆవిణ్ణి సంతోషపెట్టడానికి.

"ఇవేం ఫొటోలు?" అంటూ అడిగింది మా ఆవిడ గోడకేసి చూపుతూ.

"వాళ్ల తాతగారి కాలం నాటివే. అప్పుడు గొప్పవాళ్లే..." కాని ఇంట్లో భయంకరమైన ముక్కవాసన. పళ్లుకుళ్లిన వాసన. కాఫీ వాసనా, డాంబర్ గోలీల వాసనా కలగలిసి....

కుర్రాడు (మా అంకుల్ కొడుకు) వచ్చి టేబుల్ శుభ్రంగా దులిపి, కుర్చీలు సరిగా అరేంజి చేసి వెళ్లాడు.

తలదువ్వుకొని, డ్రెస్ చేసుకొని అంకుల్ ప్రవేశించాడు.

"నూతన దంపతులు ఇంటికివచ్చారు. శుభం. ఇలారండి. ఆ సోఫామీద మాత్రం కూర్చోవద్దు. దాని కాలు విరిగింది. కింద కూర్చుందాం, రండి".

మా ఆవిడ మొహం చూడాలంటే భయమేసింది.

"జున్ను ముక్కలాంటి పిల్లపక్కనుంటే బాగానే వుంటుంది. కాని ఎన్నాళ్లులే సుఖం. పిల్లలు పుట్టుకు రారా, ఒకరి తర్వాత ఒకరు. అప్పుడు మొదలవుతాయి ఖర్చులు. డాక్టరు బిల్లులు. స్కూలు ఫీజులు. యూనిఫారాలు, బూట్లు, ఆ తర్వాత హైస్కూలు. నాకీ బాధలు తప్పాయిలే. నా పిల్లలు మాత్రం చాలామంది పుట్టినవాళ్లు పుట్టినట్టే. దేవుడి దగ్గిరకెళ్లిపోయాడు. ఒకరకంగా అదీ మంచిదే."

"ఇంతకూ, నీ ఆరోగ్యం ఎలా వుంది?" అన్నాను మాట మార్చడానికి.

"ఆరోగ్యం కాదు బాబూ, మిగిలింది అనారోగ్యం. మొన్న గుండె నొప్పి వచ్చింది. జ్వరం. తిమ్మిర్లు, 'ఊరికే మూలగకు. మందేసుకొని నోర్మూసుకొని పడుకో' అంటుంది మీ ఆంటీ. నొప్పి భరించలేనప్పుడు మూలగకుండా వుంటామా, నువ్వే చెప్పు. మొన్న పొద్దున్న ఇంటి ముందరంతా మంచు పేరుకుపోయింది. తియ్యమంటే ఒక్కడూ తియ్యడే. నేనే స్వయంగా తియ్యాలిట. ముసలాణ్ణి కర్ర పట్టుకుని నడిచేవాణ్ణి. నేనేం తీస్తాను చెప్పు. పైగా పైల్స్ కంప్లయింట్ కూడా వుంది."

ఆయన మాటలు మా ఆవిడకు వినిపించొద్దని బిగ్గరగా ముక్కుచీదాను.

"ఏమిటో, తినకపోతే నీరసం. తింటే ఆయాసం. స్నానం చెయ్యకపోతే మురికి. చేస్తే జలుబు. అమ్మాయి! ఇవీ, ఈ ముసలాడి కష్టాలు."

ఈ ఇంట్లో మరికాసేపుంటే మా ఆవిడ వాంతి చేసుకుంటుంది, లేదా మూర్ఛపోతుంది. వెళ్లటానికి లేచాను.

"అప్పుడే వెడతారా? మీ ఆంటీ క్షణంలో వచ్చేస్తుంది. కొత్త దంపతులు, భోజనం చెయ్యకుండా ఎలా పోతారూ? అమ్మాయి, మొహమాటపడకు. ఇది నీ స్వంతిల్లే అనుకో. అదిగో, అక్కడో యాపిలుంది. ఆ మూలనే కాస్త మిఠాయి కూడా ఉండాలి. తీసుకొని తింటూ వుండండి.

ఏమిటమ్మాయి, నీ పెళ్లి డ్రెస్సు వాళ్లెవరితోనో కుట్టించుకున్నావట. మమ్మల్నడిగితే మేం సగం ధరకే కుట్టేవాళ్లం కాము..."

ఆవిడ సంగతేమో కాని, నాకే ఆ మాటలు వినే శక్తి లేదు. ఆయన వద్దు వద్దంటున్నా వినిపించుకోక మళ్లీ జట్కా ఎక్కాం.

మరో అంకుల్ ఇంటికెళ్లాలి. అక్కడింకేమీ డ్రామా చూడబోతున్నామో!

"నా బంధువులంతా ఇంతే. నువ్వేమనుకోవద్దు" అంటూ మా ఆవిడకు సర్దిచెప్పడానికి ప్రయత్నించాను, 'మంచి వాళ్లే. కాని దరిద్రులు. నీ బంధువుల్లాగ ఘరానా మనుషులు కాదు. నువ్వే చెప్పు డియర్, నా బంధువులు పేదవాళ్లయితే దానికి నాదా బాధ్యత?"

అనుకున్నంతా అయింది. ఆమె మొహం ఎర్రబడింది. చెక్కిళ్లదురుతున్నాయి. కన్నీళ్లాపుకోలేక పోతున్నది.

ఆమెకు అవమానంగా పరిణమించిన నా బంధువుల దిగజారిన స్థితికి సిగ్గుపడ్డాను.

"క్షమించు ప్రేయసీ, నీతో కష్టం కలిగించటం నా ఉద్దేశం ఎంత మాత్రం కాదు. భార్యను ఎంచుకోగలనే కాని బంధువులనెంచుకోలేను గదా!" నాకూ గొంతు స్వాధీనం తప్పింది.

వెక్కిళ్ల మధ్యన నా భార్య, "నీ వాళ్లను పేదవాళ్లంటే నా వాళ్లనేమంటావు? నా వాళ్లగురించి చెప్పుకోవాలన్నా తలకొట్టేసినట్టుగా వుంటుంది. ఇప్పుడు ఆ జమీందారిణి ఇంటికెడతామా, అక్కడ మా అమ్మ పనిమనిషిగా చేసింది. పైగా పేరుకే జమీందారిణి. ఇప్పుడామె పరిస్థితి దారుణంగా వుంది.

మనల్ని చూడగానే ఏమన్నా చేబదులడగొచ్చుగూడాను. కాని జాగ్రత్త. ఆమె మాటల్లో పడి నిజంగానే డబ్బులిచ్చేవు. మేం అప్పుడప్పుడూ ఆమెకు కాసింత తిండి పంపిస్తూనే వుంటాం."

నేను నమ్మలేక,

"జమీందారిణికి మీరు తిండి పంపించటమేమిటి?" అన్నాను.

"ఇంక మేయరుగారి భార్య. ఇప్పుడేమీ కాదులే. అవన్నీ పాతకాలం ముచ్చట్లు. కొత్త చొక్కా వేసుకొన్న మగాడు కనిపిస్తే చాలు. చెయ్యి చాపుతుంది. జాగ్రత్త."

నేను సంతోషాతిరేకంతో, మా ఆవిడ చెయ్యినొక్కి,

'హమ్మయ్య, నా బెంగతీరింది' అన్నాను.

సడెన్‌గా, అంకుల్ ఇంట్లో తినకుండా వదిలేసి వచ్చిన ఆపిల్, మిఠాయి, మంచిభోజనం.... చివరన కాస్త మందు కూడా దొరికేదేమో!...

మరో అంకుల్ ఇంట్లో, ఏమున్నా, లేకున్నా మందుకు మాత్రం ఢోకా లేదు.

"పద!" అన్నాను జట్కావాడితో. ■

## తింటూ తింటూ ఇ-మెయిల్

పంపొచ్చునట. తామే పని చేస్తున్నా ఇ-మెయిల్ పంపటం జరగాలని కోరుకునే వారుంటారు. అలాంటి వారి కోసం మాక్‌డొనాల్డ్ వారు ఈ సౌకర్యాన్ని త్వరలో ప్రవేశపెట్టనున్నారు. మాక్‌డొనాల్డ్ వారు తమ ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్ దగ్గరే ఇంటర్నెట్‌ను కూడా పెట్టే ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం ఈ కంపెనీ వారు ఇంటర్నెట్ కంపెనీ ఇంటెల్‌తో ఓ ఒప్పందం కుదుర్చుకున్నారట.

ఎన్.